క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మిలు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కేఆర్ పురం సచివాలయ పరిధిలోని ఎర్రాయిగూడెంలో సుమారు రూ.27 లక్షల 40 వేల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే చీమలవారిగూడెంలో రూ.28 లక్షల 90 వేల వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ ఉయికే బొజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు, సొసైటీ అధ్యక్షులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, సర్పంచ్‌లు కె.వెంకటేశ్వరరావు, బన్నే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: ప్రతి పేదవాడికి గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అవసరమైన వారికి అన్ని రకాల వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, ఎంపీటీసీ దాపర్తి మోహన్‌రావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ



మత్స్యకారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధి గణేష్ నగర్‌లో గత మూడు రోజులుగా చేపల పెంపకంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గోదావరి నదిలో వేట చేసే ఎస్టీ మత్స్యకారులకు చేపల పెంపకం, అమ్మకాలు, చెరువుల్లో చేపలు పెంచే విధానంపై మత్స్యశాఖ ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన వేట చేసే వారికి ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, సర్పంచ్ పాడుం పుష్ప సర్టిఫికెట్‌లను అందజేశారు.

ఓటే వజ్రాయుధం



బుట్టాయగూడెంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఎస్.శారా శాంతి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్య పరిచేందుకు శుక్రవారం బుట్టాయగూడెంలో సాంప్రదాయ డోలు నృత్యాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో ఓటు వేయడంలో అంతే నిజాయితీగా వ్యవహరించడం అవసరమని అన్నారు. విద్యార్థులు ఓటు వజ్రాయుధం అంటూ నినాదాలు చేశారు. అలాగే జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మానవహారం నిర్వహించారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన భవానీలు



దుర్గమ్మ సన్నిధికి వెళుతున్న భవానీలు

టి.నరసాపురం: దీక్ష పూర్తి చేసిన భవాని మాలధారులు ఇరుముడి కట్టుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఉరుడి రాఘవేంద్రరావు భవాని ఆధ్వర్యాన 40 మంది భవానీలు మండల దీక్ష చేపట్టారు. 45 రోజుల పాటు దీక్ష చేపట్టిన వీరు శుక్రవారం ఇరుముడి ధరించి విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. వీరి వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



జంగారెడ్డిగూడెం: రూ.3వేలు పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. శుక్రవారం స్థానిక అలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో జంగారెడ్డిగూడెం పట్టణం, మండలానికి సంబంధించి రూ.3వేలు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో పెట్టింది. ఇచ్చిన మాటను 100 శాతం అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు దశల వారీగా పింఛన్‌ను రూ.3వేలు వరకు పెంచుతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. వచ్చే పింఛన్ రూ.3వేలతో పేదవారు గౌరవంగా బతకవచ్చన్నారు. వృద్ధులు పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నారని, రూ.3వేల పింఛన్ వారికి ఎంతో ఉపశమనం కల్పిస్తుందన్నారు. వృద్ధులకు పింఛన్‌కు సంబంధించి 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుదించారన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు తమకు కావాల్సిన వారిని లంచాలు తీసుకుని ఎంపిక చేసేవారన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, గురజాల పార్థసారధి, బత్తిన చిన్న, పాములపర్తి శ్రీనివాస్, షేక్ అక్బర్, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, వందనపు వెంకటేశ్వరరావు, తల్లాడ సంజయ్, చిప్పాడ వెంకన్న, షేక్ అమీర్, గెద్దాడ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముందే వచ్చింది

కొయ్యలగూడెం: పెంచిన వైఎస్సార్ పెన్షన్లతో రాష్ట్రంలో వారం రోజులు ముందుగానే సంక్రాంతి ప్రారంభం అయ్యిందని అవ్వ, తాతలు మోములు కళకళలాడుతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి బాలరాజు తన భార్య, పోలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని 67 లక్షల మంది పెన్షన్‌దారులు జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలని కోరుకుంటున్నారన్నారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భర్త అనారోగ్య కారణాల వల్ల, ఆయన ఇచ్చిన వాగ్దానాల అమలుకు, అదేవిధంగా జగనన్న ఆశయ సాధనకు రాజకీయాలలోకి రావాల్సి వచ్చిందని అన్నారు. కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రధాన ప్రాధాన్యత ఇస్తా అన్నారు. పెరిగిన 214 పెన్షన్లతో రెండు కోట్ల 73 లక్షల రూపాయలు ప్రతినెలా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు. అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వృద్ధులకు పెన్షన్ పంపిణీ

చింతలపూడి: వృద్ధులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచి రూ.3 వేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అన్నారు. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలో శుక్రవారం వృద్ధులకు పెంచిన పెన్షన్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అనుకున్న సమయానికి అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో పేదల కళ్లలో ఆనందం

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన రూ.3వేలు పింఛన్‌తో వృద్ధులు, వికలాంగులు, పేదల కళ్లల్లో ఆనందం కనబడుతుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత టీడీపీ పాలనలో పింఛన్ పొందాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ తిరగవలసి వచ్చేదని, గ్రామంలో పింఛన్‌దారులు ఎవరైనా మృతి చెందితేనే ఆ పింఛను, జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ఇచ్చేవారని, ఆ పింఛను అందుకోవాలంటే, అన్న పానీయాలు మానుకుని, కనీసం మూడు రోజులైనా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగవలసి వచ్చేదని, కానీ ఇప్పుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన వెంటనే కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైనవారందరికీ, ప్రతి నెలా 1 ఒకటో తేదీ ఉదయాన్నే, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికి వచ్చి పింఛను అందజేస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో కె.శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో గతంలో 8,340 మంది పింఛన్‌దారులకుగానూ ప్రతినెలా రూ.2,48,43,000 లు అందజేస్తున్నట్లు, పెంచిన కొత్త పింఛన్లు 140 మందికి గానూ అదనంగా రూ.42,00,000 అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్, కోటగిరి శ్రీకాంత్, సర్పంచులు దేవరపల్లి రామ్మోహన్‌రావు, గుండుగోలు సుబ్బారావు, వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ బొప్పన చైతన్యకుమార్, సచివాలయాల కన్వీనర్లు షేక్ మేరా సాహెబ్, వి.శ్రీను, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చింతలపూడి: రేచర్లలో వృద్ధురాలికి పెన్షన్‌ను అందజేస్తున్న ఎంపీపీ బి.రాంబాబు నాయక్



కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మిని ప్రజలకు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కామవరపుకోట: కొత్తూరులో కొత్త పింఛన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

లంచాలకు తావు లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్

స్టేట్ లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్



సొంగా సందీప్

లింగపాలెం: రాష్ట్రంలో ప్రతి పేదవానికి లంచాలకు తావు లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి వెంటనే విడుదల చేసి ఆపద సమయంలో ఆదుకుంటున్నారని స్టేట్ లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. శుక్రవారం లింగపాలెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సహాయం కల్పించారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారీలకు గత ప్రభుత్వాలు చేయని విధంగా రాజకీయ సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆయన గుర్తు చేశారు. పేదల కళ్లలో ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీనిలో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అవ్వా, తాతలు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చే సామాజిక పింఛన్లను ఈనెల నుంచి రూ.3 వేలకు పెంచి అందిస్తున్నట్లు సందీప్ తెలిపారు. ప్రజలు గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత జగన్ పాలనకు తేడా గమనించాలని కోరారు. అర్హులందరికీ పింఛన్ మంజూరు చేసి ఠంచన్‌గా 1వ తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 39 లక్షల పింఛన్లు ఇచ్చేవారని చెప్పారు. ఇప్పుడు సీఎం జగన్ 64.50 లక్షలు పింఛన్లు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు.

సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి, బడుగు బలహీనవర్గాలకు అండగా ఉండే నేత అని చెప్పారు. పేద పిల్లలు చదువుకోవాలని సంకల్పంతో ఆయన విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు విధానం, బైజూస్, ట్యాబ్‌లు ఇచ్చి విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యపరంగా, మానసిక ఉల్లాసం కల్గుతుందనే ఉద్దేశంతో ఇంతటి మహోత్తర కార్యక్రమాన్ని సీఎం జగన్ చేపట్టారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సందీప్ పిలుపు నిచ్చారు. రానున ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయని సందీప్ అన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని సందీప్ కోరారు.

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం



జంగారెడ్డిగూడెంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను జంగారెడ్డిగూడెం పట్టణ, మండలాల పరిధిలోని సచివాలయాల్లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదతర పోటీలకు సంబంధించి డ్రా తీశారు. అలాగే క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సీఎం జగన్ సంకల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా శారీరక శ్రమ చేయాలని, అందరూ ఆటలు ఆడాలని ఎమ్మెల్యే అన్నారు. ఆడుదాం ఆంధ్ర ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, బత్తిన చిన్న, గుర్వాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవేణి, చిప్పాడ వెంకన్న, షేక్ అక్బర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, గురజాల పార్థసారధి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయప్రసాద్, కౌన్సిలర్‌లు తదతరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

కాన్వ విద్యా పీఠాధిపతి



కాన్వ విద్యా పీఠంలో బ్రహ్మశ్రీ నరసింహ శర్మ దంపతులను సత్కరిస్తున్న బాలరాజు దంపతులు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో త్వరలో ఏర్పడబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవి చేపట్టడం ఖాయమని కాన్వ విద్యా పీఠాధిపతి బ్రహ్మశ్రీ అనిపెద్ది నరసింహ శర్మ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు కొయ్యలగూడెంలోని పీఠాన్ని సందర్శించిన సందర్భంగా వారు నరసింహ శర్మతో రాష్ట్ర స్థితిగతులపై చర్చించారు. గత నాలుగు పర్యాయాలు నరసింహ శర్మ పేర్కొన్నట్టుగానే ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని, అదే సెంటిమెంట్‌తో రాజకీయాల గురించి అడిగామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అత్యధిక శాతం ప్రజలు కోరుతున్నారని ఈ సందర్భంగా కాన్వ విద్యా పీఠాధిపతి బ్రహ్మశ్రీ అనిపెద్ది నరసింహ శర్మ తెలిపారని ఆయన వివరించారు. శాస్త్రాలు పేర్కొన్నట్టుగా ప్రభుత్వం ఏర్పాటవుతుందని జ్యోస్యం పలికారు. ఈ సందర్భంగా నరసింహ శర్మ దంపతులను బాలరాజు దంపతులు శాలువాతో సత్కరించగా, నరసింహ శర్మ దంపతులు బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు బహుకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట వనజా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల, పట్టణ కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, సంకుకొండ సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము, ఎంపీటీసీలు ఘంటా శ్రీను, ఘంటసాల శీనమ్మ, కొనకళ్ళ రాము, చిటికెన నాగార్జున, మన్నే అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్‌దారులు ఆందోళన చెందొద్దు



టి.నరసాపురం సొసైటీ వద్ద డిపాజిట్‌దారులతో మాట్లాడుతున్న డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్

టి.నరసాపురం: డిపాజిట్‌దారులకు సొమ్ములు చెల్లించేందుకు కొంత వ్యవధి పడుతుందని, డిపాజిట్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్ తెలిపారు. టి.నరసాపురం సహకార సంఘంలో డిపాజిట్లు చేసిన సొమ్ములు చెల్లించడం లేదని డిపాజిట్‌దారులు గురువారం ఆందోళన నిర్వహించిన సంగతి పాఠకులకు విధితమే. దీంతో శుక్రవారం అధికారులు డిపాజిట్‌దారులతో సహకార సంఘం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్, డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి మోహన్‌బాబు మాట్లాడుతూ డిపాజిట్ దారులకు సొమ్ము చెల్లించేందుకు రెండు నుంచి మూడు నెలలు వ్యవధి పడుతుందన్నారు. సంఘంలో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారి ఆస్తులను అటాచ్ చేశామని వివరించారు. వారికి నోటీసులను జారీ చేసి, డిగ్రీలు పాస్ చేసి, అటాచ్ చేసిన ఆస్తులను విక్రయించి, ఆ సొమ్ము నుండి డిపాజిట్‌దారులకు చెల్లింపులు చేస్తామని చెప్పారు. ఈ ప్రాసెస్ జరిగేందుకు కొంత సమయం అవసరమని, సాధ్యమైనంత త్వరగా డిపాజిట్‌దారులకు న్యాయం చేస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మండలంలోని తాడువాయి, వేగవరం గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.దివ్య తెలిపారు. తాడువాయిలో పల్లెల్లి వీర్రాజు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 9 కలిగి ఉన్నాడని, అలాగే వేగవరంలో పాడపాటి సూర్యచంద్రం తన కిళ్ళీ కొట్టులో 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 8 కలిగి ఉన్నాడని, వీరు ఆయా షాపుల్లో మద్యం అమ్మడాన్ని గుర్తించామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


సమస్యలపై ఎమ్మెల్యే బాలరాజుకు వినతి



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రం ఇస్తున్న నిర్వాసితులు

బుట్టాయగూడెం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మండలంలోని దుద్దుకూరు క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యాన ఎమ్మెల్యేను కలిసిన నిర్వాసితులు తమ సమస్యలను విన్నపించుకున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సొమ్ములను తమకు త్వరితగతిన చెల్లించేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గిరిజన, గిరిజనేతరులు సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నామని వాటికి సంబంధించి కూడా సొమ్ములు చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే నిర్వాసితులకు సంబంధించి తల్లిదండ్రులు మృతి చెందితే వారి పిల్లలకు పెళ్ళి అయిన అనంతరం పరిహారం సొమ్ము చెల్లించవలసి ఉండగా వారికి ఇంత వరకూ చెల్లించలేదని తెలిపారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలకు కృషి చేయాలని కోరారు. ఇదిలా ఉండగా జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్యను కూడా నిర్వాసితులు కలిసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపించాలని అన్నారు. అధికారుల తీరు వల్ల తమ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పద్దిరెడ్డి బాబి, వీరపరాజు చిట్టిబాబు, మద్దుకూరి రామకృష్ణ, బండార్ల శివాజీ, డేరా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



ఆరోగ్య సురక్ష కార్డును అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు పిలుపునిచ్చారు. మండలంలోని చింతంపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు. దానిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వచ్చి వైద్యులు సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులతో పాటు పీహెచ్‌సీ వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విక్టర్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన జీవరత్నం అతిగా మద్యం సేవిస్తున్నాడు. ఈనెల 1వ తేదీన అతని కుటుంబ సభ్యులు మద్యం సేవించవద్దని చెప్పారు. అయితే జీవరత్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుమందు సేవించాడు. దీంతో అతనిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. అక్కడి నుంచి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి 3వ తేదీన తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కాకినాడకు తరలించారు. కాకినాడలో చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీన మృతిచెందినట్లు డీఎస్పీ తెలిపారు. జీవరత్నం బంధువు జెట్టి చిన్న కేదారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

గోసంరక్షణశాలను సందర్శించిన విద్యార్థులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీవారి కొండపై ఉన్న గోసంరక్షణశాలను శుక్రవారం సందర్శించారు. సేంద్రియ వ్యవసాయంలో గోవుల పాత్ర, పంచగవ్య తయారీ, జీవామృతం ఎలా తయారు చేస్తారన్న విషయాలను ఉపాధ్యాయులు బుచ్చిరాజు, కాంతారావు, జానకీదేవిలు విద్యార్థులకు వివరించారు. అలాగే గోవులలో గిర్, కాంక్రేజ్, సాహివాల్, పుంగనూరు, కపిల, జెర్సీ తదితర జాతుల ఆవుల ప్రాముఖ్యతను తెలియజేశారు.